


# ఉగాది సంరంభం

నేను ఉగాదిని. నేను క్రొత్త సంవత్సరాన్ని.

పసిపాప నవ్వులో నారూపం వుంది. నవ్యతలో నవదృష్టిలో దినదిన ప్రవర్ధమానమయేగాఢ మానవశక్తిలో నారూపంవుంది. నేను ఉగాదిని.

నిన్ను అభినందిద్దామని ఆనందాబ్ధిలో ఓలలాడిద్దామని నీ కన్నుల్లో పసిపాపల పాలనవ్వులు ప్రతిఫలిద్దామని వచ్చాను.

నన్ను నీ గృహంలో అలంకరించి రోజూ నన్ను అనుసరిస్తావు. విసుగుపడతావు. కోపపడతావు. ఒకరోజు నన్ను నిందిస్తావు. నామీద అశ్రువులు రాలుస్తావు. ఒకరోజు నన్ను తూలనాడుతావు శపిస్తావు. ఒకరోజు నన్ను మరచిపోతావు. నిన్ను నీవు మైమరుస్తావు. అందుకు గూడా నన్నే మాటలతో నీ మనస్సుతో పొడుస్తావు. ఐతే నాకు తెలుసు: ఏదో ఒకరోజు పదేపదే నా పేరే తలుస్తావు. తలచితలచి తరచి తరచి తరించి మురిసిపోతావు. ముత్యంలాంటిది మురిపెంగనక, మొహరులాంటి ముత్యంలాంటిది మురిపెంగనక. నీ జీవితకాలంవరకూ ఈ ఒక్క రోజునే ఆశ్రయించుకుని ఆరాధిస్తావు. ఆలపించి ఆరాటపడతావు. మళ్ళీ నవనవోన్మేషమైన క్రొత్త రోజు అలాంటి సంపూర్ణానందాన్ని నీకు సమకూర్చే క్రొత్తరోజు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తావు. పాముపాలా నాగమణిలాంటి కీవిదాలుస్తావు. ఎప్పుడు కొలువుతీర్చి మిత్రులమధ్య మకుటంలేని పట్టమహిషిలా మహిమగల మత్స్యగంధిలా మెరిసిపోదామా అని తహతహ లాడిపోతావు. నేనుకూడా. నీలాగే నాకూ పాతరోజు విసుగు. క్రొత్తదనాన్ని తీసుకురావడమూ కల్పించడమూ నాపని, నావిధి.

* * *

స్కెచ్

ఆలోచించు.

దిగుడుభావిలాంటి గతంలోకి నీదృష్టిమరల్చు. ఒక్కసారి కనువిప్పుగా ఆలోచించు. ఒకదారికిరా. ఒక నిర్ణయానికిరా. ఒక రహదారికిరా.

నాకు తెలుసు ఇన్నాళ్ళూ నువ్వు ఆలోచన చేస్తూనే వున్నావనీ, నీ ఆలోచన నిన్ను కాలుస్తున్నదనీ నిన్ను ఆర్పేస్తున్నదనీ.

నీ కన్నుల్లో దీపాలు పెట్టుకువచ్చావు. నీ నోటిలో శాపాలు తియ్యటి వాక్యాలు, నీ కర్ణపుటాల్లో శంఖులు, నీ మనస్సులో నిండైనసౌధాలువెలిగించుకుని వచ్చావు. ఆ ఆలోచనలో ఎందుకలా కూర్చుంటావు? అందుకే నీ ఆలోచన మానమంటున్నా. సరికొత్త సమాలోచన చేయమంటున్నా. నివ్వెరపడి లాభంలేదు. నిగమశర్మలా దిగ్భ్రమ చెంది వాపోయి లాభంలేదు. అందుకే సరి క్రొత్త ఆలోచన చేయమంటున్నా.

తెలుసుకో నేటికైనా, నీకు నీవే భారం. ఎవళ్ళకివాళ్ళే భారం, దాస్యం, దాసోహం, దరిద్రం, దావానలం. ప్రజల్లో ప్రిదిలిన నిజానిజాలు నేటికైనా తెలుసుకో. నీ అక్కసు నిన్నే హతమారుస్తుంది. నీ దురాలోచన నిన్నే నిర్బంధిస్తుంది. నీ విషయలోలత్వం నిన్నే నిర్బంధిస్తుంది నీ అజ్ఞానం నిన్నే తెగటారుస్తుంది. అందుకే సత్యందాచుకోక మనసు మార్చుకో.

అయితే మనకి ఉగాది ఎప్పుడువస్తుంది?

అనిసెట్టి అప్పారావు

మనకి కొత్తసంవత్సరం ఎప్పుడువస్తుంది?
కొత్తపేజీ ఎప్పుడు తెరుస్తుంది? ఎప్పుడు
నీ గుండెల్లో తలుపు తెరచి ప్రమిదె వెలిగి
వెలుతురు జాలువారుతుంది?

జీవితపు ఈ ఆటవికపు వీధిలో వెలుతురు ప్రసరించేదెప్పుడు? లోకంలో తుపాకులు నేల కొరిగేదెప్పుడు?

అయితే మనకీ ఉగాది ఉందా
మనకీ ఉగాది వస్తుందా?
అయితే మనకీ ఆ ఆగామి ఉగాది ఎప్పుడు?

* * *

ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క మెట్టు ఎక్కివస్తున్నావు. ఒక్కొక్క సోపానం అవరోహణ చేస్తున్నావు! ఆశలతో రోడ్లు ఊడుస్తున్నావు. దినతంతి అంటే నువ్వే. అస్తమయంలేని సూర్యుడిలా గూనివాడి భారంలా ఎక్కడచూసినా నువ్వే. బీడీకొట్టు దగ్గరా. కాఫీ హోటలు ఎదటా. పార్కు బెంచీ మీదా-ఎక్కడచూసినా నీ తీరే. నీమూపే. నీ చూపే. అడియాసలతో ప్రతి ఆఫీసూ గాలిస్తావు. సత్యాగ్రహి అంటే నువ్వే. అంగలారుస్తావు, నాలిక పిడచగడితే పచ్చిమంచినీళ్లు పుట్టక పోతే తపనపడతావు. పని దొరక్క మథనపడతావు. సత్యాగ్రహి అంటే నువ్వే.

గాలికి ఒదిలేయిబడిన ఓ మనిషీ, తాడూ బొంగరంలేని ఓ మనిషీ, అసరా అజమాయిషీ లేని ఓ మనిషీ- నీకూ మంచిరోజువస్తుంది. నీకూ ఈ కొత్తసంవత్సరం శుభంకోరుతుంది. జయం కోరుతుంది. నీ ఆరోగ్యం కోరుతుంది. సలక్షణంగా సాక్షాత్తు లక్ష్మీవరపుత్రుడి శమంతకమణిలా బ్రతుకుతావు.

నా సమక్షంలో నిన్ను నువ్వే తెలుసుకో. నీనుండి నిన్ను విముక్తిచేసుకో. అందుకే మరొకసారి పాతదృష్టిని మార్చురా. నీ గడియారానికి కొత్తచక్రం తొడిగించు. ఇన్నాళ్ళూ తిరిగావనుకో. పడిగాపులు గాశావనుకో. దాహమైతే ఆకలైతే పెద్దగా అరవాలనిపిస్తే నీలోనువ్వు నిన్నే నువ్వు అరుచుకుని కరుచుకుని అలసి సొలసి కుళ్ళి కృశించావనుకో. అరువు ఇవ్వరు, అరవనివ్వరు. ఛా, అప్పురేపు. ఐతే నిన్ను నువ్వు తిట్టుకున్నావనుకో. ఇదేంజీవితం! అనుకున్నావనుకో. నిన్ను నువ్వు నిఖాయించుకోవాలని చూశావనుకో, ఐనా నీలో గుమాస్తాతత్వం చావలేదు. నీలో జ్యోతులు మిన్ను ముట్టలేదు. నీ గుండెలో మంట రగల్లేదు. అనంతకోటి మానవుల్లో జ్యోతి పాయలాగ చీకటి వెలుగుల పవనంలాగ ప్రచండవాయువులాగ ప్రభంజనంలాగ వేస్తుంది. ఆ యుగాంతపు వేళ ఆసన్న మవుతుంది. అందుకే నిన్న మొన్నటి ఇవాల్టి ఊహాలు అంతకుముందు వాటితో పోల్చుకో, నేటి ఉద్దేశాలతో సరిచూసుకో, వీటివల్ల లాభం ఏమైనా ఉందా? ఈ ఉద్దేశాలని వదలిపెట్టి రా, అవసరాలు, అవకాశాలు, ఫలితాలు.

ఈ ఆలోచనలు సర్వైనవేనా పనికి వచ్చేవేనా, హానిలేదుగా, దుర్బుదిలేదుగా?

అందుకే నీ ఆలోచన మానవయ్యా అంటున్నది. సరికొత్త ఆలోచన చెయ్యవయ్యా అంటున్నది. ఒక్క మెట్టు ఊగిపోతే విరిగిపోతే ఒక్కొ రక్తనాళం ఒక్కొక్క రక్తనాళ సంబంధం తెగిపోతే ప్రాణం విలవిల లాడిపోతే- గతాన్ని నిందించకు. ఏళ్లుపూడేకొద్దీ నీ రెండలాంటి గతం నిష్పాక్షికంగా అవుపించేకొద్దీ నిజానికి గతాన్ని దూషించి భూషించి లాభం ఏముంది?

తీగమీద నడిచే ఓ మ ని షీ, సమాజపు సమ్మెటమీద అణగగొట్టబడ్డ ఓ మనిషీ, తీవ్రత నెరిగిన ఓమనిషీ నిజానికి గతం శవంలాంటి పోలికలో ఎందుకు వుంది? వుందని ఎందుకు అనుకుంటావు. నిరాశాభూతం పెనవేసుకున్న ఓ మనిషీ, సంసారం ఈదలేక కష్టాలు దాటలేక పెడబొబ్బలు పెడుతున్న ఓ మనిషీ కోర్కెల కైవారంలో నీ నిలయంగనక జీవితం సమ్మోహనాస్త్రం లాంటిది గనక ఆడది మయూరం లాంటిది గనక గతం శవంలాంటి పోలికలోలేదు. ప్రస్తుతం ప్రళయంలాంటిది కాదు భావి పసిపాప లాంటిది కాదు. తెలుసుకో నేటికైనా తప్పించుకో లేవు ఏనాటికైనా, దారి తప్పలేవు ఏనాటికైనా. తెలుసుకో నేటికైనా.

ఐనా నీకూ నాకూ కొత్త సంవత్సరం ఏమిటి అనుకోకు. ఎవరినివాళ్లు అభినందించుకుంటే సరి. హుందాగా నిండుగా నిర్లిప్తంగా అవుపిస్తే సరి. చాలు. కొత్త సంవత్సరం మార్పులు తెస్తుందా?

ఎవరికి వాళ్ళు అనుకుని తృప్తిపడక పోయినా ఆశలు కల్పించుకుంటే సరి!

ఎవరి సమయం వాళ్ళకి వస్తుంది. ఎవరి కొత్త సంవత్సరం వాళ్ళకి ప్రారంభిస్తుంది. ఎవరి నూతనత్వం వాళ్ళకి వెల్లివిరుస్తుంది. పొరపాట్లు లేకుండా మెలకువగా ఉంటే సరి. అగచాట్లు లేకుండా మెరుపు తీగెలా పరిస్థితులను అవగతం చేసుకుని మెలగగలిగితే సరి.

* * *

నేను కొత్తసంవత్సరాన్ని.

నేను ఉగాదిని.

ఆశలులేనివాళ్ళకి ఆశలు కల్పిస్తా. కొత్త కోర్కెలు సృజిస్తా. నెరవేరుస్తా. స్పందించే ఆశలమీద నిగనిగలాడే నీలగగనం నిర్మిస్తా. వెన్నెల వలువలు కావిస్తా.

ఆనందాలు సమకూరుస్తా. ఆశయాలుచిత్రిస్తా. అవకాశాలు సమీకరిస్తా.

నేను కొత్తసంవత్సరాన్ని. నా పేరు తలవండి. నన్ను పిలవండి.

నేను ఉగాదిని. తరతమాదుల భేదంలేని మీ అభ్యాగతిని.

* * *

ఏదో ఒకగడ్డికరిచి ఏదోఒకరకంగా కొంత డబ్బు ఆర్జిస్తాననుకో. నీతిమీద నిలబడేననుకో. నిజాయితీమీద నమ్మశక్యంగాని నమ్మకం ఉంచేననుకో.

నువ్వు ఎంతో ప్రయోజకుడవని అందరూ అనుకుంటే నీ చూట్టూ నీ వాళ్ళందరూ చేరితే- నువ్వుకాస్తా మితిమీరిన తాహతులేని అంతస్థులు అందుకోబోతే నీడబ్బుకాస్తా వ్యాపారంలో మునిగిపోతే తగలబడితే నీ భార్య చేయిదేవుళ్ళకి మొక్కితే ప్రభుత్వం శిక్షకన్నువేస్తే పెద్దపెద్ద ధనికులు రాత్పూరప్పులూ కాని నిక్షేపరాయుళ్లు నువ్వు అప్పు ఎగవేస్తావేమోనని నువ్వు నష్టపోయావుగనక నిన్ను "బులావ్, బులావ్" అంటే వేటుకుక్కలని నీమీదకు ఎగదోలితే తోడేళ్ళకి మళ్లే నీమీద ఎగబడితే ఇంట్లో ఉండికూడా నువ్వు లేవని అనిపిస్తే నువ్వుకట్టుకున్న భార్యే నీ తెలివితేటల్ని శంకిస్తే నువ్వుకాస్త ఆలోచించి ఉండాల్సిందని తలపోస్తే తనకి ఎప్పుడూ ఏమీ చెప్పవని చెప్పినా తనుచెప్పినట్లు చెయ్యవని అందుకే అంతా ఇలానాశనమైందని లోలోన ఆడిపోస్తే బాహాటంగా నలుగురిఎదటబడి నిస్సంకోచంగా అంటూంటే నీ వాళ్లెవరూ నిన్ను దరిరానీయకపోతే నీతల అవమానంతో చింతతో దిగులుతో భూమిలోకి దించుకుపోతే నీభార్య రోజుకి వేయిదేవుళ్ళకి మొక్కితే పైకి నీకుండే నిబ్బరంచూసి అందరూ ఆశ్చర్యపోతే లోలోన నీ వినాశనాన్ని కోరుతున్నవాళ్ళయినా నువ్వు అవుపించినప్పుడు చారలగుర్రంలా నీలోనిదుఃఖం పొంగితే ఒకవేళ మరీ అవుసరపడి ఇంట్లోనుంచి కదలి నువ్వు బైటికిపోతే "మళ్ళీ - సమయం రావాలిగాని నువ్వు ఏదో ఒకటి చెయ్యకుండా వుంటావా" "నీలాంటి వాళ్ళకి డబ్బుసంపాయించడమంటే—ఊఁ! అదెంతపని? తెలివితేటలు ఉండాలిగాని!" అని అన్నా చాటుగా నీఇల్లు తాకట్టులోవుందని నీ భార్య మెడలో సొమ్ములు కుదువబెట్టావని ఏవో అపభ్రంశకపుమాటలు చేతగాని మాటలు అంటుంటే ఈలోన నీలోన కొత్త ఆలోచన పొడిగితే ఎదిగి ఫలాలుపండితే నీ ఆశలు నిండితే నీభార్యముఖంలో ఆనందం వింజామరలా విప్పారితే నీఇల్లు కలకలలాడితే నీపాప కళ్ళలో నిన్నునువ్వు చూసుకో. నీ జీవితంలో — నీ తల్లి కళ్ళల్లో నీభార్య కళ్ళల్లో నీపాప కళ్ళల్లో నిన్ను నువ్వు చూసుకో. అందుకే వస్తున్నా నేను. ఆ ఆరోజు కొరకే ఆలశ్యంచేస్తున్నా నేను. జాగ్రత్తగావుండు. క్షేమంగావుండు. ఆరోగ్యంజాగ్రత్త. మంచిరోజుకొరకు వేచివుండు. అంతవరకు నీ వ్యాపకాల మతలబు కట్టిపెట్టు. కొత్తగా వ్యాపారము ప్రారంభించు. వచ్చాను నేను. నీ ఇంటిలో ఆశలనే విత్తనాలుచల్లి కోర్కెలనే మొక్కనాటి డబ్బు అనే చెట్టు పెంచను వచ్చాను నేను.

నీ జేబులో సిగరెట్టు బైటికి తియ్యి. నీ మనస్సులో ఉద్దేశాలు వదిలివెయ్యి. సిగరెట్టు తాపీగా కాల్చుకో. నీ ఆలోచన మానుకో. నీ పాదాల్లో విరిగిన రాళ్లెన్నో, నువ్వునడిచిన మైళ్ళెన్నో మరచిపో. విప్పారిన నేత్రాలవంక చూడకు. మయూరము వంటిది ఆడది గనుక విధిగా తలవంచుకు నడువు. మయూరం సర్పాలకి మరణం. వీనుల విందుగామాట్లాడు. సర్పాలు మానవుడుకి మరణం.

కనులపండువుగా అవుపించు. మానవుడికి మయూరంలాంటిది గనక.

నిన్ను మినహాయించుకుని ఇతర్లని సులువుగా మంచినీటిప్రాయంగా నిందించడానికి "సంఘం" అనేది పసందైన పేరేననుకో: డబ్బు దొరక్కపోతే నిద్రాణంగా నిస్త్రాణంగా నిస్సత్తువగా ఆలోచించలేక క్రోధంమండిపోతే జ్వలిస్తే కంటికి అవుపించని వాళ్లు కారకులు గనక మనస్సుకు ఆలోచనకు అందకపోతే సంఘం అనేది మంచి నీలేననుకో. ఐతే నువ్వనే "సంఘం"లో నీ పాలూ వుంది. నేననే "సంఘం"లో నాచెయ్యీ వుంది.

"నాకేం మహారాజుని" అనుకునే రోజులు పోయాయి.

"నాకేం నవ్వండి" అనుకునే రోజులూ పోయాయి.

"నాలోనేను", "నన్నేద్వనీరు" అనేరోజులూ పోయాయి.

నిరంతరం బస్తాలు వీపునమోసే నీడలాంటి జీవితంగల ఓ మనిషీ, ఈడ్పు బళ్ళు లాగే ఓ మనిషీ, ఓర్మి కూర్మి ధార్మిగల ఓమనిషీ—ఒక్కసారి తల ఎత్తి చూడు. నిన్నభినందించవచ్చిన ఊహాజనం వంక చూడు. ఎర్రగులాబీలకిమల్లే సుకుమారంగా తలలువంచిన పిల్లల ముఖాలవంక చూడు. ఒక్కసారి తలయెత్తి చూడు. ఒక్కక్షణం నవ్వు. ఒక్కక్షణం నువ్వుకూడా కొత్తదనాన్ని ధరించు, వహించు. రాబోయే సుదినం కోసం నీకళ్ళల్లో నీల కిరణాలు అమర్చుకో.

సమాజం నిన్ను లొంగదీస్తుందని బాధ పడతావా? సమాజాన్ని మార్చాలని నువ్వు ప్రయత్నిస్తావా? ధైర్యసాహసం కావాలి. చెయ్యగలిగితే చెయ్యి. మాట్లాడకు, దూషించకు ఈ సమాజ రూపాన్ని పరిమార్చకలిగితే నవసమాజం చేయగలిగితే; తాహత్తువుంటే చెయ్యగలిగినదంతా చెయ్యి.

నీ హృదయకుహురంలో చిద్విలాస చిన్మయజ్యోతి వెలుగిస్తున్నా, నీ వదనంలో అరవిందం అమరుస్తున్నా నీ జీవితాన్ని అమరం చేస్తున్నా నీ కన్నుల్లో కాంతులున్నా నీమాటలు పోగుచేసి మంటలు రాజేస్తున్నా. నీ ఊహాలకి ఊపిరి సాకిస్తున్నా, నీ చూపులకి అర్థం రాస్తున్నా.

ఈ లోకంలో జరిగేదిలేదు. జరగన్దిలేదు. అంతా ఒక కాసారంలోని కర్రపుల్లలమీద చలిచీమలబారు. కవనం చెప్పేవాళ్ళగోడు.

ఒక నిలకడా ఒక స్థావరం లేని మనిషీ, జీవితం తలక్రిందులైన మనిషీ సహస్రనామాలుగల మనిషీ సావధానంగా విను.

నీ మంచికోరుతున్నా. నీకు శుభం కోరుతున్నా. నీకు ఆనందం కోరుతున్నా. నీకు సర్వభోగాలు కోరుతున్నా మంచిని ఆశించి నీ మార్పు కోరుతున్నా, చేయగల్గితే ఎవరికైనా మంచిచెయ్యి, ఉపకారంచెయ్యి. లేకపోతే ఉన్నమట్టుకే ఊరుకో. ద్రోహం తలపెట్టకు, దుశ్చర్య తలపెట్టకు. తప్పతాగిన మనిషిలా ప్రవర్తించకు. నీకు పట్టీపట్టనట్లు అంటీఅంటనట్లు ప్రవర్తించకు.

ఆనందం వనంలాంటిది. వనంలో సరోవనంలాంటిది. నీకు కొత్త సంవత్సరం రంగురంగుల అభివందనాలు పంచిపెడుతుంది. ఆహ్లాదం ఆహ్వానంలాంటిది. ఆమోదం పచ్చజెండాలాంటిది. వనవిహారంలాంటిది. నీకు ఉగాది రకరకాల ఆలోచనలు, ఆశ్చర్యాలు, అమదానందాలు పంచిపెడుతుంది.

జీవితం గణితంలాంటి అరణ్యంలాంటిది. అరణ్యంలో రెండుచెట్లు నశిస్తే నాల్గుచెట్లు పెరుగుతాయి. అరణ్యం మనకి అర్థంకాని సమస్యలాంటిది. మనకి పరిచయంలేనివాడి సలహాలాంటిది. వాఘ్యంలాంటిది, జీవితం గణితంలాంటి అరణ్యంలాంటిది.

మాంగనీసులాంటి మాత్సర్యం అరికట్టకల ఓ మనిషీ, మనసులో మత్స్యముత్యాలవంటి మమతలు పారాడే ఓ మనిషీ, ఉత్సవంలా ఉప్పెనలా పెనుతుఫానులా ఆకాశగంగలా వస్తున్న ఓ మనిషీ-వాంఛనీయంగా వరప్రసాదినిలా వచ్చాను, రామణీయకంగా వందిమాగధుల్లా వచ్చాను.

నేను కొత్తసంవత్సరాన్ని, రంగవల్లిని.
నేను ఉగాదిని, నవవధువుని.
తరతమ భేదాలులేనిచోట తారతమ్యాలు
లేనిచోట

నేనే ఉగాదిని.
నేను ఉగాదిని.
నేను కొత్తసంవత్సరాన్ని. ★